సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా

సాలూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు మేనేజర్ సాయి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన యువతకు సాలూరు, బొబ్బిలి, విజయనగరం, వైజాగ్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పనకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల యువత ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు అర్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఇ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి



వీడియో కాన్ఫిరెన్స్‌లో పాల్గొన్న జేసీ గోవిందరావు, తదితరులు

పార్వతీపురం: ఖరీఫ్ పంటలకు సంబంధించి ఇ-క్రాప్ నమోదును పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం మాట్లాడారు. సెప్టెంబర్ 15 నాటికి ఖరీఫ్ ఈ పంట నమోదు పూర్తిచేసి, 30వ తేదీ నాటికి రైతు భరోసా కేంద్రాల్లో తుది జాబితాను ప్రదర్శించాలన్నారు. జిల్లా జేసీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ రీ సర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయని, ఫైనల్ ఆర్ఓఆర్ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని, స్టోన్ ప్లాంటేషన్ పనులను మూడు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. 4జీ సెల్ టవర్లకు భూములు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ జె.వెంకటరావు, పీఆర్ఎస్ఈ ఎంవీఆర్ కృష్ణాజీ, సీపీఓ టి.వీర్రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

భయం..భయం..

- పులి సంచారంతో మన్యంలో అలజడి
- చిన్నబగ్గ కాలనీ పరిసరాల్లో పులిపాదముద్రలు
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న అటవీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు



మర్రిపాడులో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎఫ్‌బీవో దాలినాయుడు

సీతంపేట: పులి సంచారంతో మన్యంలో అలజడి నెలకుంది. సీతంపేట ఏజెన్సీలో చిన్నబగ్గ ప్రాంతంలో గురువారం పులిసంచరించినట్టు అటవీశాఖ సిబ్బందికి ఆనవాళ్లు కనిపించాయి. భామిని మండలం నుంచి చిన్నబగ్గ కాలనీవైపు వచ్చినట్టు పులి పాదముద్రలను బట్టి తెలుస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎఫ్‌బీఓ దాలినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. బృందాలుగా విడిపోయి చిన్నబగ్గ, పూతికవలస, మర్రిపాడు, తుంబలి, కీసరజోడు, దిబ్బగూడ తదితర గ్రామాల్లో దండోరా వేయించారు. రాత్రి, వేకువ జాము సమయంలో బయటకు వెళ్లొద్దంటూ హెచ్చరికలు జారీచేశారు. పులి సంచరించే సమాచారాన్ని సీతంపేట తహసీల్దార్ ఫోన్: 73966 89244, సీతంపేట ఎస్ఐ: 63099 90883, పాలకొండ ఎఫ్ఆర్ఓ: 94937 35395, ఎఫ్‌బీఓ పోలవరం: 94417 98818, ఎఫ్‌బీఓ బగ్గ: 79890 65527నంబర్లకు తెలియజేయాలని కోరారు.

20 అడుగుల గిరినాగు హతం

వేపాడ: మండలంలోని కొండగుళ్లు-గుడివాడ గ్రామాల మధ్యలో వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు కళ్లాల సమీపంలో గురువారం కనిపించిన 20 అడుగుల పొడవున్న గిరినాగును చూసి స్థానికులు భయపడ్డారు. కొందరు యువకులు వెంటనే తేరుకుని గిరినాగు, దాని పిల్లను హతమార్చారు.



కొండగుళ్లు సమీపంలో హతమార్చిన గిరినాగు, పిల్లనాగు

సూక్ష్మసేద్యంతో సాగుబాగు

జామి: సూక్ష్మ సేద్యంలో తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటల సాగుచేయవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్) పీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ తెలిపారు. జామి మండలం అలమండ గ్రామానికి చెందిన అచ్యుతరావు పొలంలో ఏర్పాటు చేసిన బిందు సేద్యం యూనిట్‌ను గురువారం పరిశీలించారు. రూ.2,82,950లు విలువైన యూనిట్‌కు రూ.1,40,877లు రాయితీ వర్తించిందని తెలిపారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు

మంచి రోజులు

- రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.18వేలు కేవలం 10 నెలలకే వేతనం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెలకు రూ.57,100 చొప్పన ఏడాదంతా జీతం
- జిల్లాలోని 14 ప్రభుత్వ కళాశాలల్లో 190 మందికి లబ్ధి
- 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 52 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోధిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుడు

పార్వతీపురం టౌన్:

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు మంచి రోజులు వచ్చాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం నెలకు రూ.18 వేల జీతం ఏడాదిలో పదినెలలే అందేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారి వేతనం నెలకు రూ.57,100కు పెరిగింది. అది కూడా 12 నెలల కాలానికి అందజేస్తోంది. తాజాగా 2014 జూన్ 2కు ముందు ఉద్యోగంలో చేరి, ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వీరికి ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని సదుపాయాలు వర్తించనుండడంతో జిల్లాలోని సుమారు 190 మంది అధ్యాపకుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 4,100 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తుండగా పార్వతీపురం మన్యం జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో దాదాపు 190 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, ఆరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 52 మంది అధ్యాపకులు పనిచేస్తున్నారు.

ఆనందదాయకం



గతంలో నెలకు కేవలం రూ.18 వేల జీతానికే పనిచేశాం. గత 15 ఏళ్లుగా సాలూరు ప్రభుత్వ కళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నా. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక జీతం రూ.57,100కు పెరగడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ఆనందదాయకం.

– తెర్లి శ్రీనివాసరావు, జూనియర్ లెక్చరర్, సాలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

ముఖ్యమంత్రి మేలు మరువలేం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ నిర్ణయం హర్షించదగ్గది. రూ.18 వేల జీతానికే పనిచేసిన అధ్యాపకులకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నెలకు రూ.57,100కు పెంచింది. తాజాగా తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయంతో ప్రభుత్వ సదుపాయాలన్నీ వర్తించనున్నాయి.

– టి.నవీన్‌కుమార్, కాంట్రాక్టు అధ్యాపకుడు, సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

జీవితానికి భరోసా



గతంలో మా సమస్యను ప్రజాసంకల్పయాత్రలో జగన్ మోహన్‌రెడ్డికి వివరించాం. అధికారంలో వచ్చిన తరువాత సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పకుండా క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మా జీవితానికి భరోసా కల్పించారు.

– వి.కె.గణపతి మహారాణ, జూనియర్ లెక్చరర్, చినమేరంగి

ఎన్నడూ లేని విధంగా..



సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాయి. గతంలో ఏ ప్రభుత్వమూ చేయనిది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిచూపింది. ఏపీఎన్‌జీఓ సంఘం తరఫున ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– జీవీఆర్ఎస్ కిషోర్, ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆశలు ఫలించాయి



ఏళ్ల తరబడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాం. ఎన్నోఏళ్లగా ఎదురు చూస్తున్న మా ఆశలు జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో ఫలించాయి. ఆయన మేలు మరవలేనిది.

– డి.లక్ష్మణరావు, జూనియర్ లెక్చరర్, పార్వతీపురం ప్రభుత్వం జూనియర్ కళాశాల

అభినందనీయం



కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉద్యోగులపై సానుకూలంగా ఉంది. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చి.. మరోసారి మాటతప్పని నేతగా జగన్ మోహన్‌రెడ్డి పేరుపొందారు.

– భరత్‌భూషణ్ రాజ్, ఉత్తరాంధ్ర ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల ఐక్యవేదిక కన్వీనర్

జగనన్నకు కృతజ్ఞతలు



జూనియర్ లెక్చరర్లకు ముఖ్యమంత్రి తీపికబురు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,626 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను క్రమబద్ధీకరించారు. ఇది మా కుటుంబాల్లో ఆర్థిక వెలుగును నింపుతుంది. మాలాంటి వారి అభ్యున్నతికి కృషిచేస్తున్న సీఎం జగనన్న మేలు మరువలేం. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఎం.శ్రీనివాసరావు, జూనియర్ లెక్చరర్, మక్కువ ప్రభుత్వ జూనియర్ కళాశాల

జగన్ పాలనకు జనం జేజేలు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- విజయమే లక్ష్యంగా సాగుదాం
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యం
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని డిప్యూటీసీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఇదే విషయాన్ని పలు సర్వేలు చెబుతున్నాయని స్పష్టంచేశారు. సాలూరు పట్టణం శివాలయం రోడ్డు సమీపంలోని ఓ కళ్యాణమండపంలో గురువారం నిర్వహించిన పట్టణ, మండల, సచివాలయ కన్వీనర్ల నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్వీనర్లు, గృహసారథులందరూ వచ్చేనెల 10వ తేదీలోగా బీమా నమోదును పూర్తిచేసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా, అవినీతిరహితంగా, అత్యంత పారదర్శకంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తోందన్నారు. ఆర్థిక లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమచేస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలుచేసినట్టు వివరించారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13.5 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల్లో సుమారు 75 శాతం మహిళలకే అందాయన్నారు. మహిళలకు వివిధ రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీరు వ్యవస్థలతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. ఫ్యామిలీడాక్టర్ విధానంతో ప్రజలకు ఊరిలోనే మెరుగైన వైద్యసేవలు అందుతున్నట్టు తెలియజేశారు. 2014లో మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు.. హామీలు అమలుచేయకుండా మహిళలు, రైతులు, యువతను మోసగించిన విషయం మర్చిపోరాదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 అసెంబ్లీ స్థానాలు సాధించే దిశగా వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పువ్వల ఈశ్వరమ్మ, జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, మావుడి రంగునాయుడు, శ్రీనివాసులనాయుడు, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, బడ్నాన ప్రమీల, రెడ్డి సురేష్, దండి శ్రీనివాసరావు, గిరి రఘు, కళ్లేపల్లి త్రినాథ్, త్రినాథనాయుడు, గొట్టాపు ముత్యాలునాయుడు, డోల బాబ్జి, పాచిపెంట వీరంనాయుడు, తట్టికాయల గౌరీశ్వరరావు, లెంక సన్యాసినాయుడు, ఎస్.ఈశ్వరరావు, లెంక రత్నాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్న హస్తం

- అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సీఎం సహాయనిధి
- పాలకొండ ఎమ్మెల్యే కళావతి చొరవతో రూ.3.60 లక్షలు మంజూరు
- చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



అలజంగి దుర్గారావుకు సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన అలజంగి దుర్గారావు కుటుంబానికి ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అండగా నిలిచారు. అతని భార్య జ్యోతి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య చికిత్సల కోసం రూ.3.60 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఆతని ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యే కళావతి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జ్యోతి వైద్య చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.3.60 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత చెక్కును వండవ క్యాంపు కార్యాలయంలో బాధితురాలి భర్త దుర్గారావుకు ఎమ్మెల్యే కళావతి గురువారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి లీలాప్రసాదరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



బెజ్జిలో ఓటర్ల సర్వే ప్రక్రియపై ఆరాతీస్తున్న పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కల్పనాకుమారి

పాలకొండ రూరల్: ఓటర్ల సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సర్వే సిబ్బందికి సూచించారు. పాలకొండ మండలం బెజ్జి గ్రామంలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను, బూత్ నంబర్ 202లో ఓటర్ల జాబితా, తాజా పరిస్థితిపై ఆరాతీశారు. ఓటర్లను తొలగించే క్రమంలో, నూతన ఓటర్లను నమోదు చేసే సమయంతో నిబంధనలు అనుసరించాలని బీఎల్ఓలకు సూచించారు. టీడీ పారాపురంలో 203 పోలింగ్ బూత్‌లో ఓటర్ల సర్వేపై స్థానిక రాజకీయ నాయకులు అందించిన ఫిర్యాదులు స్వీకరించారు. సర్వే ప్రక్రియలో చోటుచేసుకున్న లోపాలు సరిచేయాలన్నారు. అలసత్వం వహిస్తున్న సూపర్‌వైజర్, బీఎల్ఓకు షోకాజు నోటీసులు అందించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.బుచ్చయ్యను ఆదేశించారు. అనంతరం తుమరాడ గ్రామంలో నిర్మాణదశలో ఉన్న రైతుభరోసా, సచివాలయ కేంద్రాల పనులు పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. పశువైద్యాధికారులు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించాలన్నారు. తంపటాపల్లి గ్రామంలో హౌసింగ్ లేఅవుట్‌ను సందర్శించారు. అక్కడ మంజూరైన గృహాలు, నిర్మాణాల స్థితిగతులపై హౌసింగ్ ఏఈ మాధవరావును అడిగి తెలుసుకున్నారు. తాత్కాలిక రహదారులు, విద్యుత్ తదితర వసతులు కల్పించాలన్నారు.

గౌరమ్మకు తొలిపూజ



రైతులు వరినాట్లు వేసే సమయంలో గౌరమ్మకు తొలిపూజ చేస్తారు. నాట్లు వేసిన పొలం గట్టుపై వరినారు కట్టను ఉంచి పసుపుకుంకుమలు సమర్పిస్తారు. పంటలు కలిసిరావాలని ప్రార్థిస్తారు. జానపద గీతాలతో గౌరమ్మను కొలుస్తూ ఉభాలు పూర్తిచేస్తారు. అటుగా వెళ్లే ప్రయాణికులు, పాదాచారులు సైతం గట్టుమీద ఉండే గౌరమ్మతల్లికి పూజలు చేసి దక్షిణవేస్తారు. ఇది ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయం.

– రాజాం

గ్రూప్-1లో విజయకేతనం

రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఉన్నత ఉద్యోగాలు సాధించారు. యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా భార్గవ్



తండ్రి విష్ణుతో వావిలపల్లి భార్గవ్

రాజాం సిటీ: పట్టణ పరిధి సారథి గ్రామానికి చెందిన వావిలపల్లి భార్గవ్ గ్రూప్-1 ఫలితాల్లో స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. ఆయన 1 నుంచి 10వ తరగతి వరకు రాజాంలోని శారదా కాన్వెంట్‌లో చదివి 557 మార్కులు సాధించారు.. ఇంటర్మీడియట్ విద్యను స్థానిక వేదగాయత్రి కళాశాలలోను, ఇంజినీరింగ్ విద్యను జీఎంఆర్ ఐటీలో పూర్తిచేశారు. స్టేట్‌బ్యాంకు క్యాషియర్‌గా ఉద్యోగం సాధిస్తూ గ్రూప్స్‌కు సిద్ధమై విజయం సాధించారు.. సివిల్స్ సాధించడం లక్ష్యమని, ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నట్టు భార్గవ్ తెలిపారు. ఆయన తల్లి ఈశ్వరమ్మ గృహిణికాగా, తండ్రి విష్ణు జి.సిగడాం మండలం పాలఖండ్యాం యూపీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా మూర్తి



ఎ.వి.ఆర్.మూర్తి

గుర్ల: మండలంలోని నాగళ్లవలసకు చెందిన అట్టాడ వెంకట రమణ మూర్తి గ్రూప్-1 ఫలితాల్లో విజేతగా నిలిచి జిల్లా రిజిస్ట్రార్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కుమారుడు ఉన్నత ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు అప్పలనాయుడు, పద్మావతి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

శ్రీసాయిహర్ష ప్రతిభ



కుమారుడు శ్రీసాయిహర్షకు మిఠాయిలు తినిపిస్తున్న తల్లితండ్రులు చంద్రరావు, ప్రభావతి

పాలకొండ రూరల్: పట్టణంలోని ఓంసాయి నగర్‌కు చెందిన ముంజి శ్రీసాయిహర్ష గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికయ్యారు. ఆయన పూర్తి విద్యాభ్యాసం ఓంసాయి విద్యాసంస్థల్లో జరిగింది. 10వ తరగతిలో 582 మార్కులు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 977 మార్కులు సాధించి బీఏ విద్యను ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని శ్రీచైతన్యలో పూర్తిచేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని ఇగ్నో యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో పీజీ చేస్తున్నారు. సివిల్స్ పూర్తిచేయాలనే ఆసక్తిలో భాగంగా గ్రూప్స్‌కు హాజరై తొలిప్రయత్నంలో ఎంపీడీఓ ఉద్యోగం సాధించినట్టు తెలిపారు. రానున్నరోజుల్లో సివిల్స్‌కు ప్రయత్నిస్తానన్నారు. కుమారుని విజయంపై ఉపాధ్యాయులైన తల్లితండ్రులు చంద్రరావు, ప్రభావతి హర్షం వ్యక్తం చేశారు.

కూలీ బిడ్డ డిప్యూటీ కలెక్టర్



మడక కృష్ణమూర్తి

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస గ్రామానికి చెందిన మడక కృష్ణమూర్తి గ్రూప్-1 ఫలితాల్లో ప్రతిభ చూపి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆయన ప్రస్తుతం విశాఖపట్టణంలో గ్రేహౌండ్స్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి రామారావు వ్యవసాయ కూలీకాగా, తల్లి గృహిణి. 1 నుంచి 10వ తరగతి వరకు బొబ్బిలి మండలం రంగరాయపురంలో ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఇంటర్మీడియట్ విద్యను బొబ్బిలి సత్యసాయి జూనియర్ కళాశాలలోను, బీటెక్, ఎంటెక్ విద్యను విజయనగరం ఎంవీజీఆర్‌లో పూర్తిచేశారు. కొడుకు విజయంపై తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు.

డీలర్ కూతురు డీఎస్పీ..



కెల్ల ఉదయ పావని

నెల్లిమర్ల రూరల్: ప్రాథమిక విద్యాభ్యాసమంతా ప్రభుత్వ పాఠశాలలోనే.. పట్టు విడవని సంకల్పం, పుస్తకాలతో నిరంతర కుస్తీ.. వెరసి ఆమెను తొలి ప్రయత్నంలోనే ఉన్నత ఉద్యోగిరాలిగా నిలబెట్టాయి. అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదంటూ నిరూపించిన కెల్ల ఉదయ పావని నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. నెల్లిమర్ల మండలంలోని మారుమూల గ్రామమైన అలుగోలుకు చెందిన పావని తండ్రి నారాయణప్పలనాయుడు రేషన్ షాపు డీలర్‌కాగా, తల్లి భారతి అంగన్‌వాడీ టీచర్. పావని పదో తరగతి వరకు గ్రామంలోని ఉన్నత పాఠశాలలోనే విద్య నభ్యసించారు. పదో తరగతి టాపర్‌గా నిలిచి విశాఖలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేశారు. అనంతరం కాకినాడ జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేసి.. ఉద్యోగ సాధనలో నిమగ్నమయ్యారు. సివిల్స్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న పావని ఆ దిశగా 2022లో పరీక్ష రాసి కేవలం 14 మార్కుల కటాఫ్‌తో ఉద్యోగానికి దూరమయ్యారు.. గ్రూప్-1 పరీక్షలో విజేతగా నిలిచి డీఎస్పీ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ సివిల్స్ సాధనకు శిక్షణ పొందుతున్నారు. ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ ... తొలి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని, సివిల్స్‌లో సత్తా చాటి కలెక్టర్ కావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

క్లుప్తంగా

20న అండర్-13 చెస్ క్రీడాకారుల ఎంపిక

● జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న అండర్-13 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవీ జ్వాలాముఖి గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని రింగ్‌రోడ్‌లో గల ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించే ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు 2010 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులను అక్టోబర్ 27,28,29,30 తేదీల్లో విజయనగరం వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, పేర్ల నమోదు కోసం ఫోన్ 97033 44488 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు స్వామినాయుడు



జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన స్వామినాయుడు, కోచ్ గణేష్

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న స్విమ్మింగ్ పోటీలకు విజయనగరం జిల్లాకు చెందిన బి.స్వామినాయుడు అర్హత సాధించాడు, ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు ఒడిశా రాజధాని భువనేశ్వర్ వేదికగా జరగనున్న 39వ సబ్ జూనియర్, 49వ జూనియర్స్ జాతీయ స్థాయి స్విమ్మింగ్స్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున స్వామినాయుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించిన స్వామినాయుడు, కోచ్ బి.గణేష్‌లను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభా పాటవాలు కనబరిచి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

యువకుడి ఆత్మహత్య

పార్వతీపురం/కొమరాడ: ఇంటిలో ఏర్పడిన స్వల్ప ఘర్షణతో క్షణికావేశంలో పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చి కొమరాడ మండలం దళాయిపేటలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న ఎస్.వెంకటి (35) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం భార్యాభర్తల మధ్య జరిగిన స్వల్ప ఘర్షణతో వెంకటి మనస్తాపం చెంది పురుగు మందు తాగేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు 108 వాహనం ద్వారా జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ సిబ్బంది

బొబ్బిలి: ఎస్ఈబీ బొబ్బిలి సర్కిల్ పరిధి తెర్లాం మండలం పెరుమాళికి చెందిన కొరగంజి సత్యనారాయణ మద్యం సీసాలు విక్రయిస్తుండగా పట్టుకున్నామని సీఐ ఆర్.జైభీమ్ విలేకరులకు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ నిందితుడు గ్రామంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని 19 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ క్రాప్ ఉండగా.. భయమెందుకు దండగ..!

● జిల్లాలో ప్రారంభమైన ఖరీఫ్ పంటల నమోదు
● సమగ్ర నమోదుకు జియో ఫెన్సింగ్ సిస్టమ్
● అన్నదాతలకు బహుళ ప్రయోజనాలు



పాలకొండ మండలంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్/పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 2,29,705 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,34,719 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోంది. గతేడాది పంటల నమోదులో తలెత్తిన లోపాలను అధిగమించేందుకు తాజాగా జియోఫెన్సింగ్ సిస్టమ్‌తో ఎంపిక చేసుకున్న సర్వే నంబర్లలో ఫొటో తీయాల్సి ఉంది. నూతన విధానంలో ఈ క్రాప్‌లో ఎటువంటి సవరణ ఆప్షన్ లేదు. దీంతో పంటల నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వెబ్‌ల్యాండ్ డేటా లింక్ (ఎన్ఎస్ఐసీ) సహకారంతో యాప్‌ను వ్యవసాయ శాఖ రూపొందించింది.

లక్ష్యాలను పూర్తిచేసేందుకు..

నిర్ణీత గడువులోగా పంటల నమోదు లక్ష్యాలను పూర్తి చేసే విధంగా వ్యవసాయ శాఖ కార్యాచరణ రూపొందించింది. సెప్టెంబర్ 15 నుంచి 30 వరకు ఈ క్రాప్‌లో నమోదు చేసిన వివరాల మేరకు రైతుల ఈ కేవైసీ తీసుకోనున్నారు. ఏడీఏ, జేడీఏ, జేసీ, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు సూపర్ చెక్ చేసిన తర్వాత సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. అటుపై రైతులకు డిజిటల్, మాన్యువల్ రసీదులు ఇవ్వాల్సి ఉంది. పంటను సులభంగా గుర్తించడానికి తగినంత ఎత్తు ఉందా లేదా గుర్తించి ఫొటో తీసే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఆహార పంటలను ధాన్యాలుగా మార్పు చేశారు. చిరుధాన్యాల్లో జొన్న, సజ్జ, రాగి తదితర పంటలను చేర్చారు. రక్షిత సాగు (షేడ్ నెట్/పాలిహౌస్‌లో సాగు) పంటలను కూడా ఈ-క్రాప్ లో నమోదు చేస్తారు. వరి పంటకాలం నారుమడి నుంచి పంట కోత వరకు ఉంటుంది. నాట్లు వేసిన రోజు నుంచి 25-30 రోజుల ముందు విత్తనం వేసినట్లుగా(డేట్ ఆఫ్ సోయింగ్) ఉండాలి.

రెండు శాఖల పర్యవేక్షణ

ఈ ఏడాది పంటల నమోదును వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పర్యవేక్షించనున్నాయి. గ్రామస్థాయిలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్ పంటలను నమోదు చేస్తారు. ఈ డేటాను వీఆర్వోలు ధ్రువీకరించాల్సి ఉంది. తర్వాత మండల వ్యవసాయ అధికారి లాగిన్‌కు, అక్కడి నుంచి తహసీల్దార్ లాగిన్‌కు వివరాలు వెళ్తాయి. వెబ్‌ల్యాండ్ డేటాను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల పొరపాట్లకు తావు లేకుండా ఉంటుంది. వెబ్‌ల్యాండ్‌లో ప్రతి సర్వే నంబర్‌కు రైతు ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటుంది. ఈ-కర్షక్ యాప్‌కు ఆర్‌బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ ఇప్పటికే చేయడంతో యాప్‌లో రైతు ఆధార్ నంబర్ నమోదు చేస్తే భూమి వివరాలు దర్శనమిస్తాయి. ఈ క్రాప్‌లో భాగంగా సాగు వివరాలు నమోదు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో పంట ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.

శతశాతం పారదర్శకత

పంటల నమోదులో వందశాతం పారదర్శకత ఉండేందుకు ఈ దఫా జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. పంట పొలాల్లో తీసిన ఫొటోలను అక్షాంశం, రేఖాంశం ద్వారా విశ్లేషిస్తారు. జియో ఫెన్సింగ్‌తో చేసిన ఈ క్రాప్ బుకింగ్ ఏ విధంగా ఉంటుందనే దానిపై ఇప్పటికే అవగాహన కల్పించారు. పంటల నమోదు, ఫొటోలు అప్లోడ్ చేయడంలో తేడాలు ఉంటే వ్యవసాయశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకుంటారు. క్షేత్రస్థాయిలో నమోదు చేయనున్న వివరాలను సిబ్బంది పూర్తిగా పరిశీలించిన తర్వాతనే అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

ఈ క్రాప్ నమోదుతో ప్రయోజనాలు ఇలా..

● ఈ క్రాప్ నమోదు ఆధారంగా స్కేల్ ఆఫ్‌ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు
● వైఎస్ఆర్ సున్నా వడ్డీకి అర్హత
రూపాయి కూడా ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమా



ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తు వ్యవసాయ శాఖ అధికారులు

● ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటనష్టం జరిగినపుడు పెట్టుబడి పరిహారం
● ధరలు పడిపోయినపుడు కనీస మద్దతు ధరతో రైతుభరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

విస్తృతంగా అవగాహన



పంటల నమోదుతో కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది పంటల నమోదు మరింత పకడ్బందీగా చేపడుతున్నాం. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పంటలను ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే 15 మండలాల్లో 1194.32 ఎకరాల్లో నమోదు చేపట్టాం. నిర్దేశిత సమయంలో శతశాతం నమోదు పూర్తి చేస్తాం. వచ్చే నెల 19 నుంచి 24 వరకు ఆర్‌బీకేల్లో జాబితాలను ప్రదర్శిస్తాం. 25 నుంచి 28 వరకు అభ్యంతరాలు పరిష్కరిస్తాం. సెప్టెంబర్ 30 నాటికి సోషల్ ఆడిట్, సూపర్‌చెక్, ఈ కేవైసీ నిర్వహించి తుది జాబితా సిద్ధం చేస్తాం.

కె.రాబర్ట్‌పాల్,
జిల్లా వ్యవసాయాధికారి, పార్వతీపురం మన్యం

వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన

● జేసీ ఆర్.గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు

పార్వతీపురంటౌన్: వినియోగదారుల రక్షణ చట్టం, 2019 పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, అందుకు గాను వారికి ఈ చట్టం గురించి తెలియజేయాలని జాయింట్‌కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఐటీడీఏ సామాజిక భవనంలో వినియోగదారుల క్లబ్ ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన 189 మంది ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లకు జిల్లాస్థాయి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టం, 2019 పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 8వ, 9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారు క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లేందుకు వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం – పౌరసరఫరాల శాఖ విస్తృతమైన ప్రచారాన్ని ప్రారంభిస్తోందని చెప్పారు. విద్యార్థి సంఘం భాగస్వామ్యం లేకుండా, వినియోగదారుల హక్కులను సమాజానికి తెలియజేయలేమని, అందుకుగాను విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేసేందుకు వినియోగదారుల క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో 8, 9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారు క్లబ్‌ను ప్రారంభించి అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక అందజేశామని, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించడం, వినియోగదారులకు సంబంధించిన విషయాలపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించడం, వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలు, వినియోగదారుల సవాళ్లపై సర్వే వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఇన్‌చార్జ్‌లకు చట్టంపై అవగాహన

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ అన్ని ఉన్నత పాఠశాలల్లో 8-9వ తరగతి విద్యార్థుల కోసం ఒక వినియోగదారుల క్లబ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల క్లబ్‌లకు ఇన్‌చార్జిలుగా నియమించిన 189 మంది ఉపాధ్యాయులకు ఈ చట్టం పట్ల అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. వినియోగదారుల క్లబ్ ఇన్‌చార్జ్‌గా నియమితుడైన ఉపాధ్యాయుడు కార్యాచరణను అమలుచేసి ఈ చట్టం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

ఐటీ, టూరిజం, హాస్పిటాలిటీలో ఉచిత శిక్షణ

● 23 వరకు అభ్యర్థుల ఎంపిక

పార్వతీపురంటౌన్: ఐటీ/టూరిజం అండ్ హాస్పిటాలిటీ/రంగాల్లో శిక్షణ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ సీతంపేట కేంద్రంలో ఈ నెల 23వ తేదీ వరకు అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు డీడీయూజీకేవై, సీడాప్, ఏపీఎస్ఎస్ డీసీ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనంతో పాటు మెటీరియల్స్ అందజేస్తామని, తరగతులు పూర్తయ్యాక ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్, ఆటోమోటివ్ అండ్ ఏరోస్పేస్‌లో బీ.టెక్/డిప్లమో విభాగాల్లో 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 23 ఏళ్ల వయసు గల యువకులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత విద్యార్హత పత్రాలతో యూత్ ట్రైనింగ్ సెంటర్ సీతంపేట కేంద్రానికి ఈ నెల 23వ తేదీలోగా హాజరు కావాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా స్కిల్ కాలేజ్‌లో శిక్షణ ఉంటుందని తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 7032060773నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారిణికి రూ.లక్ష ఆర్థిక సాయం



రెడ్డి మౌనికకు చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: టెన్నికాయిట్ క్రీడలో రాణిస్తూ అంతర్జాతీయ పోటీలకు వెళ్తున్న క్రీడాకారిణి రెడ్డి మౌనికకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.లక్ష ఆర్థికసాయం చేశారు. ఈ మేరకు గురువారం చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.లక్ష చెక్కును మౌనికతో పాటు ఆమె తల్లిదండ్రులకు అందజేశారు. అండర్-20 విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రెడ్డిమౌనిక సౌత్ ఆఫ్రికా వెళ్లనుంది. ఆర్థికంగా స్థోమత లేని మౌనిక వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఆశ్రయించి తన పరిస్థితి వివరించింది. దీనికి స్పందించిన ఆయన జిల్లా పరిషత్ నిధుల నుంచి విమాన చార్జీల నిమిత్తం లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు మీసాల విజయలక్ష్మి, ఇప్పిలివెంకటనర్సమ్మ, జెడ్పీటీసీలు వాకాడ శ్రీనివాసరావు, వలిరెడ్డి శిరీష, శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వృత్తి ధర్మం పాటిద్దాం



సర్గీయ చింతామణి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

● 'సేవ్ జర్నలిజం' సదస్సులో జర్నలిస్టులు



సదస్సులో మాట్లాడుతున్న ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు

విజయనగరం అర్బన్: వృత్తి ధర్మాన్ని పాటిస్తూ పవిత్రమైన జర్నలిజం విలువలను పరిరక్షించుకోవాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఏపీయూడబ్ల్యూజే 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'సేవ్ జర్నలిజం' అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఈ మేరకు పేర్కొన్నారు. తొలుత క్లబ్ ఆవరణలో ఉన్న సర్గీయ సీవై చింతామణి విగ్రహానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఇటీవల ఎన్నికైన ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ, ఎలక్ట్రానిక్ మీడియా సంఘం, చిన్న పత్రికల సంఘం నూతన కార్యవర్గాలు బాధ్యతలను స్వీకరించాయి. సంఘం వార్షిక ప్రణాళిక రూపకల్పనపై సీనియర్ జర్నలిస్టులు ఇచ్చిన సూచనలు, సలహాలను నూతన కమిటీ స్వీకరించింది. అనంతరం ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కీలకమైన సమాచార వ్యవస్థలో జర్నలిస్టుల బాధ్యత విలువలతో కూడినదన్నారు. పత్రికల వైరుధ్యాలు ఎలా ఉన్నా జర్నలిస్టుల సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీప్రసాద్, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్‌రాజు, వైస్ ప్రెసిడెంట్లు మహాపాత్రో, మంచాది అప్పారావు, ఆరిపాక రాము, కోశాధికారి కుసుమంచి శ్రీనివాసరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రయాగ పైడిరాజు, ఎ.నరసింహులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గణేష్ పట్నాయక్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేజేశర్మ, సముద్రాల నాగరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.విజయభాస్కర్, సీనియర్ జర్నలిస్టులు జీవీప్రసాద్, ఈ.సురేష్‌కుమార్, రాధాకృష్ణ, వీఎంలక్ష్మణరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గజరాజుల అలజడి



మాదలింగి మామిడితోటలో తిష్టవేసిన గజరాజుల గుంపు



ధ్వంసమైన రైస్‌మిల్లు

కొమరాడ: మండల ప్రజలను గజరాజుల బాధ వీడడం లేదు. మూడు రోజులుగా మాదలింగి గ్రామ సమీపంలోని మామిడితోటలో తిష్ట వేసిన ఏడు ఏనుగులు బుధవారం రాత్రి గ్రామానికి చెందిన త్రినాథ్ నాయుడు ధాన్యం మిల్లుపై దాడి చేసి యంత్రాలు ధ్వంసం చేశాయని గ్రామ రైతులు చెబుతున్నారు. సుమారు రూ.10లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. ఉభాలు వేసిన పొలాలను తొక్కి పాడుచేస్తున్నాయని ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఎప్పుడు ఎలా దాడి చేస్తాయోనని భయందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు కూడా సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని తరువాత ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు దృష్టి సారించి గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని కోరుతున్నారు.

రైళ్లలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ



జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: రైళ్లలో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో రైళ్లలో ప్రయాణిస్తూ, ఫుట్‌బోర్డుల వద్ద కూర్చొని, లేదా నిల్చున్న ప్రయాణికులు సెల్‌ఫోన్లు చూస్తుండగా కొంతమంది ఆకతాయిలు వారి చేతుల్లోని మొబైల్ ఫోన్‌లను కర్రతో కొట్టి కిందపడగొట్టి, కాజేస్తున్నారని, ఆదేవిధంగా ఔటర్లలో ఆగిన రైళ్లలోకి ఆకతాయిలు ప్రవేశించి, భోగీలో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను కాజేస్తున్నట్లుగా పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, జిల్లా పోలీసులతో ఏర్పడిన ఈ ప్రత్యేక బృందాలు ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేకంగా దృష్టిపెడతాయని చెప్పారు. సమావేశంలో ఎస్పీ సీఐ కేకేవీ విజయనాథ్, జీఆర్‌పీ ఎస్సై రవివర్మ, ఆర్‌పీఎఫ్ ఎస్సై బి.శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేకాధికారి సమీక్ష

విజయనగరం గంటస్తంభం: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లా ప్రత్యేకాధికారి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి బీ.ఎం.దివాన్ మైదీన్ శుక్రవారం సమీక్షించనున్నారని గృహ నిర్మాణ సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమీక్ష సమావేశానికి గృహనిర్మాణ సంస్థ క్షేత్రస్థాయి అధికారులు, ఎంపీడీలు, ఇంజినీరింగ్ సహాయకులు, వార్డు పరిపాలన సహాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్న జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు తదితర సౌకర్యాల కల్పన తదితర అంశాలపై సమీక్ష అనంతరం ఆ కాలనీలను సందర్శిస్తారని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పార్వతీపురంటౌన్: పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా అటవీశాఖ అధికారి జీఏపీ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పులి కదలికలు ఉదయం, సాయంత్రం, చీకటి పడిన తరువాత, రాత్రివేళల్లో ఎక్కువ చురుగ్గా ఉంటాయన్నారు. రంగురంగుల దుస్తులు ధరించకుండా లైట్‌కలర్ దుస్తులు ధరించాలని, చీకటి వేళల్లో ఆరు బయట బహిర్భూమికి వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. పులి పాదముద్రలు గమనించిన వెంటనే ఉత్సుకతతో వెళ్లకుండా తక్షణమే సురక్షితమైన ప్రదేశానికి చేరుకోవాలని పేర్కొన్నారు. పులి సాధారణంగా మట్టి రోడ్లులో సంచరిస్తుందని, పొలానికి వెళ్లే రైతులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ఒకవేళ పులికి దగ్గర పడితే అకస్మాత్తుగా పరిగెత్తకుండా నిదానంగా, నిశ్శబ్దంగా ఆప్రాంతం నుంచి వెళ్లిపోవాలని, పులి కన్పించినపుడు దాని కళ్లల్లో కళ్లుపెట్టి చూడరాదన్నారు. పెంపుడు జంతువులు ఆవులు, గేదెలు, ఎద్దులు, మేకలపై దాడి చేస్తే వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



విజయనగరం క్రైమ్: శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. మృతుడి శరీరంపై ఉన్న షర్ట్ కాలర్ మార్క్ ఆధారంగా విజయనగరం వాసిగా రైల్వే పోలీసులు తెలిపినట్లు విజయనగరం జీఆర్‌పీ ఎస్సై రవివర్మ గురువారం తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే వెంటనే తమను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు..

పట్టణంలో బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గురువారం రాత్రి ఓ యువకుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వైజంక్షన్ నుంచి అరుణ జూట్ మిల్లు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, పక్కనుంచి వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో డకిని వీధికి చెందిన నడిపేన నవీన్ కుమార్ (30) తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో బస్సు డ్రైవర్ వెంటనే కేంద్రాస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై గణేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపు తొలగించనందుకు కొట్లాట



చికిత్స పొందుతున్న సత్యనారాయణ

పార్వతీపురం: ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన కార్పెంటర్ షాపు తొలగించనందుకు గొడవ జరిగి ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కార్పెంటర్ ఎస్.సత్యనారాయణ తన ఇంటి సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గ్రామ పెద్దల అనుమతితో ఐదేళ్ల క్రితం కార్పెంటర్ షాపు ఏర్పాటు చేశాడు. అయితే షాపు ఉన్న వీధిలో సీసీ కాలువలను ఏర్పాటు చేయాలని గ్రామ పెద్ద డి. ధనుంజయనాయుడు కార్పెంటర్ సత్యనారాయణకు తెలియజేశాడు. ఈనెల 16న స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు కూడా అందజేశారు. ఈ క్రమంలో గురువారం డ్రైనేజీలు తవ్వేందుకు జేసీబీని తీసుకుని వస్తుండగా సత్యనారాయణ కోర్టు ఆర్డర్‌ను చూపించేందుకు ప్రయత్నించగా ధనుంజయనాయుడు వచ్చి షాపును తొలగిస్తావా లేదా అని వాగ్వాదానికి దిగి కొట్టాడు. ఈ సంఘటనలో సత్యనారాయణకు పలు చోట్ల గాయాలు కావడంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్ ద్వారా తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,380-00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224